
అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యాయత్నం

● భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం 7

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

శుక్రవారం 19 సెప్టెంబరు 2025



పూల జాతరకు వేళాయే..

తెలంగాణలో తొమ్మిది రోజుల పాటు జరిగే బతకమ్మ పండుగలో పూల ప్రాధాన్యత ఎంతో గొప్పది. గునుగు, తంగెడు, పట్టుకుచ్చుల బంతి పూలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. గునుగు, తంగేడు పూలు మైదాన ప్రాంతాల్లో విరివిగా లభిస్తాయి. బంతి పూలను పలువురు రైతులు సాగు చేస్తున్నారు. కొండపాక మండల కేంద్రంలో ఓ రైతు రెండెకరాల్లో పట్టుపుచ్చుల బంతి పూలు సాగు చేస్తున్నాడు. గునుగు పువ్వు ఈసారి ఆలస్యమయ్యే అవకాశం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు.

-సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్







దంచికొట్టిన వాన

- బుధవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భారీ వర్షం
- గురువారం సాయంత్రం నుంచి పలుచోట్ల..
- పొంగిపొర్లిన చెరువులు, వాగులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- గరిష్టంగా 107.3 మి.మీ వర్షపాతం నమోదు

సిద్దిపేట/చిన్నకోడూరు/నంగునూరు/తొగుట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం రాత్రి నుంచి మొదలైన వర్షం గురువారం ఉదయం వరకు పడింది. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని చెరువులు, చెక్‌డ్యామ్‌లు పొంగి పొర్లుతున్నాయి. తొగుటలో భారీ వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తొగుటలో కురిసిన భారీ వర్షానికి పలు ఇళ్లలోకి నీరు చేరడంతో బకెట్లతో నీటిని ఎత్తిపోశారు. మండలంలోని కాన్గల్ గ్రామ శివారు నుంచి అల్వాల వెళ్లే రహదారిపై కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. గురువారం సాయంత్రం నుంచి జిల్లాలో వర్షం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నది. కుకునూరుపల్లి మండలంలో విద్యుత్ సరఫరకు అంతరాయం ఏర్పడింది. ములుగు మండలంలో కురుస్తున్న భారీ వర్షానికి పలు రోడ్లు జలమయమయ్యాయి. చిన్నకోడూరు మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలలోకి వర్షం నీరు చేరి అలుగు పారుతున్నాయి. చిన్నకోడూరులో పెద్ద చెరువు మత్తడి దూకుతుండడంతో ఆ మత్తడి నీరు సిద్దిపేట - ఇల్లంతకుంట ప్రధాన రోడ్డులోని కల్వర్టు పై నుంచి ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని ఇబ్రహీంనగర్ శివారులో గోనెపల్లికి వెళ్లే మార్గంలో రాజన్న వాగు కల్వర్టు పైనుంచి ప్రవహించడంతో ఆ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల్లో పంట చేలలో వర్షం నీరు

మిగతా 8వ పేజీలో



ములుగులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మండలం	వర్షపాతం (మి.మీ.)
వర్గల్	107.3
తొగుట	99.3
చిన్నకోడూర్	64.0
ములుగు	53.3
మిరుదొడ్డి	50.5
మర్కుక్	48.5
చేర్యాల	47.0
కొమురవెల్లి	46.5
రాయపోల్	45.3
కొండపాక	42.5
దౌల్తాబాద్	41.0
కుకునూర్‌పల్లి	39.0
జగదేవ్‌పూర్	38.5
గజ్వేల్	36.8
సిద్దిపేట అర్బన్	26.5

మల్లన్నసాగర్‌లోకి ఈ ఏడాది 25 టీఎంసీలే

తొగుట మండలం తుక్కాపూర్ శివారులో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి గోదావరి నీటి ఎత్తిపోతలు రెండు రోజుల్లో నిలిచిపోనున్నాయి. గత నెల 18న రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల పంపింగ్‌ను ప్రారంభించగా అప్పటికే రిజర్వాయర్‌లో 10.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నెల రోజుల పాటు బాహుబలి మోటర్ల ద్వారా 13.87 టీఎంసీల నీటిని అధికారులు ఎత్తిపోశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లోకి మూడు పంపులతో నీటిని ఎత్తిపోస్తుండగా 24.12 టీఎంసీల నీరునిల్వ ఉన్నట్లు మల్లన్నసాగర్ డిప్యూటీ ఇంజనీరు చెన్ను శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ ఏడాది రిజర్వాయర్‌లోకి గరిష్ఠంగా 30 టీఎంసీల గోదావరి నీటిని ఎత్తిపోయాలని నిర్ణయించినప్పటికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు రోజుల్లోగా 25 టీఎంసీల నీటిని నింపి పంపులను ఆపేయనున్నట్లు చేయనున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



కాన్గల్ నుంచి అల్వాల వెళ్లే రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు



చిన్నకోడూరు శివారులో వరి చేనులో నిలిచిన వర్షం నీరు



మల్లన్నసాగర్‌లోకి మూడుపంపులతో నీరు

ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా కోకో

- అనుభవం ఉన్న రైతులు అవగాహన కల్పించాలి
- టెలీకాన్ఫరెన్స్‌లో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట/అక్కన్నపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగులో అంతర్ పంట వేయడం వలన ఎంతో మేలు చేకూరుతుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఇటీవల అశ్వరావుపేటకు వెళ్లి ఆయిల్‌పామ్ సాగులో అంతర్ పంట సాగైన కోకో, వక్క పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా గురువారం సిద్దిపేట నియోజకవర్గ రైతులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆయిల్‌పామ్‌పై ఇంపోర్ట్ డ్యూటీని 28 శాతం ఉంటే దాన్ని 18 శాతానికి తగ్గించిందని, ఈ విషయమై బీజేపీ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని చెప్పారు. ఆయిల్‌సాగులో అనుభవం ఉన్న రైతులు ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయిల్ పామ్‌లో అంతర పంట సాగుతో ప్రయోజనం ఉంటుందని, ఆయిల్‌పామ్‌లో కోకో సాగుకు ఎకరానికి రూ.12వేల రాయితీ ఉందని, అదనంగా రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు వరకు ఆదాయం వస్తుందన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, కోకో పంట వేస్తే ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. ఇది ఆయిల్‌పామ్ సాగుకు మరో ముందడుగని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుని మరింత ప్రోత్సహించాలని, మీరే ఆయిల్‌పామ్ బ్రాండ్ అంబాసిడర్లు చెప్పారు.

ఆయిల్ పామ్ తోటలు సాగు చేయాలి

జిల్లాలో ఆయిల్ పామ్ తోటలను సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పేర్కొన్నారు. గురువారం అక్కన్నపేట మండలం మోత్కులపల్లి గ్రామంలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌లో భాగంగా గొర్ల కొమురయ్య రైతుకు చెందిన మూడు ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలను నాటి మాట్లాడారు. ఆయిల్‌పామ్ తోటల్లో అంతర్ పంటగా సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, జిల్లా హార్టికల్చర్ అధికారి స్వరూప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐల య్య, ఎంపీడీవో బానోతు జయరాం, ఎంపీవో గుగులోతు మోహన్, మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా, మండ ల హార్టికల్చర్ అధికారి బాలాజీ, ఏఈవోలు సింధుజ, సబిహా, శ్రీలత పాల్గొన్నారు.



అక్కన్నపేట మండలం మోత్కులపల్లిలో ఆయిల్‌పామ్ మొక్కను నాటి నీరు పడుతున్న అదనపు కలెక్టర్ గరిమా

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటకల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టులలోని పీజీ విద్యార్థులకు బోధించుటకు అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. సునీత ప్రకటనలో తెలిపారు. తెలుగు, అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం, చరిత్ర, ఎం.కామ్, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, మత్స్యశాస్త్రం, సూక్ష్మజీవశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే 50 శాతం మార్కులు ఉండాలని చెప్పారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగి ఉండి పీజీ విద్యార్థులకు బోధించిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 19న కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, 20న కళాశాలలో ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని, ఇంటర్వ్యూలకు వచ్చే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ హైమావతి

బెజ్జంకి/సిద్దిపేట/సిద్దిపేటఅర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వైద్యసిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించడంతో పాటు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హైమావతి వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని తోటపల్లి పీహెచ్‌సీని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది అంటెడెన్స్, ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల 19 మంజూరు కాగా 15 నిర్మాణాలు గ్రౌండింగ్ అయ్యాయని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం వీరాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించి గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న లబ్ధిదారుల ఇంటిని చూసి వారిని అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో ప్రవీణ్, వైద్య సిబ్బంది, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియలో వేగం పెంచాలి

ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియలో వేగం పెంచాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం సిద్దిపేట కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియపై అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి కలెక్టర్ ఎంపీడీవోలు, ఎంపీవో, హౌసింగ్ ఏఈ, మున్సిపల్ కమిషనర్లతో జూమ్ యాప్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఎల్-1 దరఖాస్తులను పీఎంఏవై యాప్‌లో పంచాయతీ కార్యదర్శులకు రోజు వారిగా టార్గెట్ ఇచ్చి అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీవో, ఇంజనీరింగ్ హౌసింగ్ పీడీ జయదేవ్‌ఆర్య, డీపీవో దేవకీదేవి పాల్గొన్నారు.

● జిల్లాలో మహిళా స్వయం సహాయక బృందాల మాదిరిగానే 14 ఏళ్ల నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సు గల కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించి సమావేశంలో ఆమె మాట్లాడారు. కిశోర బాలికల సంఘాలు ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఇటువంటి సంఘాల ద్వారా సామాజిక రుగ్మతలను రూపుమాపవచ్చని జీవితంలో అత్యంత కీలక దశ అయిన ఈ దశలో సరైన మార్గదర్శకం ఇస్తే మంచి పౌరులుగా ఎదుగుతారని అన్నారు. సంఘాలు ఏర్పాటు చేయడం ద్వారా కిషోర్ బాలికల భద్రత పోషకాహారం ఆరోగ్యం నైపుణ్య శిక్షణ ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషించవచ్చని ఆమె తెలిపారు.



తోటపల్లి పీహెచ్‌సీని సందర్శిస్తున్న కలెక్టర్ హైమావతి

సార్లు.. సమయానికి రారు!

- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఇష్టారాజ్యం!!
- హుస్నాబాద్‌లోని కార్యాలయంలో నిత్యం ఇదే తంతు..

హుస్నాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకచోట ఉంటే, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం మాత్రం గుట్టపై, పట్టణానికి దూరంగా ఉంది. దీంతో ఆఫీసుకు వచ్చేవారు తక్కువగా ఉంటారు. ఇదే అదనుగా భావించిన అధికారులు, సిబ్బంది తమ ఇష్టానుసారం విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



భాళీ కుర్చీతో డీఈఈ చాంబర్

మిషన్ భగీరథ పనుల కోసం కార్యాలయానికి వెళ్లే కాంట్రాక్టర్లకు, ప్రజలకు పడిగాపులు తప్పడం లేదు. ఆఫీసుకు వెళ్తే డీఈఈ కానీ, ఏఈలు కానీ అందుబాటులో ఉండరు. అడిగితే ఫీల్డ్ మీద వెళ్లారని సిబ్బంది సమాధానం చెబుతున్నారు. గురువారం ఉదయం 11:30 గంటలు అయినా కేవలం ఒక జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విధుల్లో ఉన్నారు. డీఈఈ సహా ఇతర అధికారులు ఎవరూ రాలేదు. మిగిలిన ప్రభుత్వ కార్యాలయాల మాదిరిగా ఐవోసీలోకి మార్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న ఏఈఈల చాంబర్

ప్రమాదకరంగా..

- గుంతలమయంగా మారిన రోడ్లు.. తరచూ ప్రమాదాలు
- అధికారులు మరమ్మతులు చేయాలని వేడుకోలు

8

ఎర్రబారిన పచ్చని పొలాలు

- వర్షం మాటున పరిశ్రమల నుంచి వ్యర్థ జలాల విడుదల
- కన్నెత్తి చూడని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు

7

బురదలో కూరుకుపోయిన బస్సు

- ట్రాక్టర్ సహాయంతో బయటకు..

దౌల్తాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలంలోని ఆదర్శ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు గురువారం ఉదయం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోనాపూర్ గ్రామం నుంచి బయలుదేరిన ఆర్టీసీ బస్సు, దౌల్తాబాద్ శివారులోని కాలువ వంతెన వద్ద బురదలో కూరుకుపోయి ఒక పక్కకు ఒరిగిపోయింది. దీంతో బస్సులోని విద్యార్థులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. డ్రైవర్ విద్యార్థులను బస్సులోంచి దింపి సురక్షిత ప్రాంతానికి చేర్చారు. చివరకు గ్రామస్థులు ఒక ట్రాక్టర్ సహాయంతో బస్సును లాగడంతో విద్యార్థులు, డ్రైవర్, కండక్టర్ ఊపిరి పీల్చుకున్నారు.గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "రోడ్లు ఇలా ఉంటే మా చదువులు ఎలా సాగుతాయి?" అంటూ నిలదీశారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరారు.



కోనాపూర్ బ్రిడ్జి వద్ద బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సును ట్రాక్టర్‌తో లాగుతున్న దృశ్యం

కొండముచ్చులు దొరికాయి



కొండముచ్చులను జాలీలో బంధించిన అటవీశాఖ అధికారులు

జహీరాబాద్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలో వారం రోజులుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన కొండ ముచ్చులైతే ఎట్టకేలకు దొరికాయి. కొండ ముచ్చులను పట్టుకోవడంతో ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. వారం రోజులుగా దాదాపు 10మందిపై దాడులు చేశాయి. రాష్ట్ర జాగోతెలంగాణ అధ్యక్షుడు రాములునేత, నాయకులు ఇమ్రాన్, మాదీనం శివప్రసాద్ అటవీశాఖ జిల్లా అధికారి శ్రీధర్‌రావు, జహీరాబాద్ మున్సిపల్‌కమిషనర్ సుభాష్‌రావు తదితరులపై ఒత్తిడితేవడంతో వారంతా వారం రోజులుగా శ్రమించి కొండ ముచ్చులను పట్టుకునే వారిని అప్పగించారు. దీంతో వారు గురువారం పట్టణంలో అవి సంచరించే ప్రాంతాల్లో తిరిగి సుమారు 20 కొండ ముచ్చులను పట్టుకుని ఇనుపజాలీలో బంధించి అటవీప్రాంతాలకు తీసుకువెళ్లారు.

ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం

మహిళ దుర్మరణం



ప్రమాదానికి కారణమైన ట్యాంకర్, ఫొటోలు, వీడియోలు తీస్తున్న జనం

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఓ ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఓ మహిళ దుర్మరణం పాలలైంది. సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద గురువారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో రెడ్ సిగ్నల్ పడినప్పటికీ లారీ ట్యాంకర్ డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా ముందుకు నడిపాడు. ముందున్న ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ మహిళ లారీ చక్రాల కింద పడి శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. సదాశివపేట పట్టణానికి చెందిన ప్రతాప్ తన భార్య అరుణతో పాటు అత్తమ్మ విజయలక్ష్మి(56)లతో కలిసి ద్విచక్ర వాహనంపై గురువారం సదాశివపేట నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. పోతిరెడ్డిపల్లి చౌరస్తావద్దకు రాగానే ట్రాఫిక్ సిగ్నల్ పడింది. అతడు తన ద్విచక్ర వాహనాన్ని ఆపాడు. సదాశివపేట నుంచి హైదరాబాద్ వైపు అతివేగంగా వస్తున్న ట్యాంకర్ ఆపకుండా ముందున్న అతడి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయలక్ష్మి లారీ చక్రాల కింద పడిపోగా శరీరం మొత్తం నుజ్జునుజ్జయింది. ఈ దృశ్యాన్ని అక్కడ గుమిగూడిన కొందరు తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరిస్తుండగా, మరికొందరు వీడియోలు తీస్తున్నారు.ప్రతాప్, అరుణలకు స్వల్ప గాయాలు కాగా సంగారెడ్డి రూరల్ పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై రవీందర్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామ అన్నారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

కొండపాక, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొండపాక మండలం దమ్మకపల్లి శివారులోని పిట్టల వాడలో చోటుచేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టల వాడకు చెందిన గుజరాతి చంద్రయ్య కూతురు రజిత (22) అనే యువతి బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. రజిత వారి దూరపు బంధువైన వ్యక్తిని ప్రేమిస్తున్న విషయం తల్లిదండ్రులకు తెలిసింది. దీంతో తల్లిదండ్రులు చదువు పూర్తయిన తర్వాత చూద్దామని ఏడు నెలల క్రితం చెప్పి ఒప్పించారు. ఇంతలో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పుట్టింటికి వెళ్లిన భార్య రావడంలేదని..

వర్గల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భార్య భర్తల మధ్య జరిగిన గొడవల కారణంగా పుట్టింటకి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మాదారం గ్రామానికి చెందిన అంకని సాయి కుమార్ (36), భార్య శ్యామల, వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వివాహమైనప్పటి నుంచి భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగతుండడంతో రెండు సంవత్సరాల క్రితం శ్యామల తన పుట్టింటికి వెళ్లింది. రెండు రోజుల క్రితం సాయికుమార్ తన భార్య శ్యామల వద్దకు వెళ్లి ఇంటికి రమ్మని చెప్పినా శ్యామల రానన్నది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన సాయికుమార్ జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంటి పై కప్పు రేకుల ఇనుప రాడుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి అంకని స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మృతి

నారాయణఖేడ్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఖేడ్ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేటలోని హైవే రోడ్డు 161 ఫ్లైఓవర్ కింద 85 సంవత్సరాల వృద్ధురాలు గురువారం సాయంత్రం మృతి చెందింది. పెద్దశంకరంపేట మండలం మల్కాపూర్‌కు చెందిన వడ్డెర చిన్నమ్మ(85) భిక్షాటన చేస్తూ జీవిస్తుందని, ఆమెకు సంబంధించిన వారు ఎవరూ అందుబాటులో లేరని, భిక్షాటన చేసుకుంటూ ఫ్లైఓవర్ వద్ద వృద్ధురాలు మృతి చెందిందని స్థానికులు తెలిపారు.

20తులాల వెండి బిళ్లలు అపహరణ

నర్సాపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని ఓ స్వర్ణకారుడి దుకాణంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 20తులాల వెండి బిళ్లలు అపహరించినట్లు ఎస్సై లింగం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణంలో కృష్ణచారి అనే వ్యక్తి మూడేళ్లుగా తన కులవృత్తి అయిన బంగారు, వెండి నగలకు సంబంధించిన దుకాణం నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి కూడా దుకాణానికి తాళం వేసి వెళ్లి మరుసటి రోజు ఉదయం దుకాణం షటర్ తెరిచి చూడగా దుకాణంలో అంతా చిందరవందరగా సామగ్రి పడి ఉంది. దీంతో అనుమానం వచ్చి చూడగా వెనుకభాగంలో ఉన్న వెంటి లేటర్ తొలగించి దుకాణంలో దూరి రాత్రి చోరీకి యత్నించారు. అంతా వెతకగా గల్లాపెట్టెలో ఉన్న 20తులాల వెండి బిళ్లలు అపహరించారని గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి రోహన్‌ను ఓ ఉపాధ్యాయుడు కొట్టడంతో విద్యార్థి చేతికి గాయమైంది. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని కొట్టిన ఉపాధ్యాయుడితో పాటు యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తల్లిదండ్రులు యాజమాన్యంతో చర్చలు జరిపారు. విద్యార్థి పదో తరగతి వరకు ఉచిత విద్యనందిస్తామని ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదని రూ.50 బాండ్ పేపర్‌పై ఇరువురు ఒప్పందపత్రం రాసుకున్నారు. మరోసారి ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చూసుకుంటామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు శాంతించారు. కాగా ఈ ఘటనపై సంగారెడ్డి ఎంఈవో విద్యాసాగర్ పాఠశాలకు చేరుకొని విచారణ జరిపారు. విద్యార్థిని ఎందుకు కొట్టాల్సివచ్చిందనే కారణాలను ఎంఈవో ఆరా తీశారు. ఇలా ఉండగా ఈ ఘటన తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు మహేశ్ పాఠశాలకు చేరుకొని యాజమన్యాన్ని నిలదీశారు. పోలీసులు పాఠశాల ఎదుట బందోబస్తు నిర్వహించారు.

మరమ్మతు చేస్తూ.. కరెంట్ షాక్‌తో చెరువులో పడి ఆపరేటర్ మృతి



అన్మల నర్సింలు(ఫైల్)

రామాయంపేట,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెరువుకి ఆనుకొని ఉన్న బోరు మోటార్ మరమ్మతు చేసే క్రమంలో ఆపరేటర్ నీట మునిగి చనిపోయాడు. ఘటన రామయంపేట మండల పరిధి లక్ష్మాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అన్మల నర్సింలు(40) రోజులాగే ఊరికి సరఫరా అయ్యే బోర్ స్టార్ట్ చేసేందుకు వెళ్లాడు. అది పనిచేయకపోవడంతో మరమ్మతు చేస్తూ కరెంటు వైర్లు తగిలి అక్కడే ఉన్న చెరువులో పడి ప్రాణాలు కోల్పోయాడు. పోస్టుమార్టం జరిగిన తర్వాత పోలీసులు శవాన్ని కుటుంబీకులకు అప్పగించారు. అయితే ఈ ప్రమాద ఘటనపై సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి నేతృత్వంలో పంచాయతీ సిబ్బంది తోటి కార్మికుడికి న్యాయం చేయాలంటూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు.



కాలుష్య జలాలతో ఎర్రబారిన నల్లకుంట చెరువు



ఎర్రబారి పారుతున్న కాలుష్య జలాలు

ఎర్రబారిన పచ్చని పొలాలు

వర్షం మాటున పరిశ్రమల నుంచి వ్యర్థ జలాల విడుదల

గుమ్మడిదల, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా వర్షం అంటే రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తుంది. కానీ గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామికవాడ పరిసర ప్రాంతాల్లో మాత్రం వర్షం పడితే కన్నీరు పెట్టుకుంటున్నారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని పారిశ్రామికవాడలోని దొమడుగు గ్రామ శివారులో ఉన్న రసాయన పరిశ్రమల నుంచి భారీగా కాలుష్య జలాలు నల్లకుంట చెరువులోకి చేరాయి. ఎర్రగా, నల్లగా మారిన ఆ వ్యర్థ జలాలు చెరువు కింద ఉన్న వందల ఎకరాల వరి పొలాలను ముంచెత్తాయి. తెల్లారి పొలాలకు వెళ్లిన రైతులు పచ్చని పంటలు రసాయనాలతో ఎర్రబారిన దృశ్యం చూసి నివ్వెరపోయారు. నల్లకుంట చెరువులో చేపలు చనిపోయి నీటిపై తేలియాడగా, వాటిపై ఆధారపడ్డ మత్స్యకారుల కుటుంబాలు ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశాయి. పీసీబీ (కాలుష్య నియంత్రణ మండలి) అధికారులు ఇటువైపు కనీసం తొంగిచూడకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి, కఠిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. వ్యర్థ జలాలను విడుదల చేసిన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని లేదంటే ఉద్యమిస్తామని రైతులు, మత్స్యకారులు హెచ్చరించారు.



వరి పంటను ముంచిన వ్యర్థ జలాలు

నాలుగు దశాబ్దాలలో 51 లక్షలకుపైగా సర్జరీలు

- 27వేలకుపైగా అవయవ మార్పిడులు
- అపోలో ఆస్పత్రుల సంస్థల చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రి 42వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటుందని, దాదాపు 200 మిలియన్లకుపైగా మందికి వైద్య సేవలు అందించడంతో పాటు 185 దేశాలలో నమ్మకాన్ని సంపాదించిదని అపోలో ఆస్పత్రుల సంస్థల చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనను జారీ చేశారు. 1983లో భారతదేశంలో మొట్టమొదటి కార్పొరేట్ ఆసుపత్రి ఏర్పడి, 19000కు పైగా కీలకమైన ప్రాంతాలను చేరుకుందని ప్రకటించారు. అపోలో నాలుగు దశాబ్దాలలో 51 లక్షలకు పైగా శస్త్రచికిత్సలు, 27వేలకు పైగా అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు, 22 వేలకుపైగా రోబోటిక్ సర్జరీలు, మూడు మిలియనట్లల నివారణ ఆరోగ్యపు ఉరీక్షలు, 20 మలియన్లకుపైగా డయాగ్నస్టిక్ పరీక్షలు పూర్తి చేశామన్నారు. ఆరోగ్య సంరక్షణ మానవ మూలధనాన్ని గణనీయంగా పెంచుతూ అపోలో 11 లక్షలకు పైగా నిపుణులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తాము ఆసుపత్రులను మాత్రమే కాకుండా, మానవ వనరులను తీర్చిదిద్దామని ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీత రెడ్డి పేర్కొన్నారు. దక్షిణాసియాలో మొట్టమొదటి ప్రోటాన్ క్యాన్సర్ సెంటర్, భారతదేశంలో మొట్టమొదటి ఏఐ - ప్రెసిషన్ అంకాలజీ సెంటర్, మొట్టమొదటి సైబర్‌నైఫ్ఎ రోబోటిక్ రేడియో సర్జరీ సిస్టమ్ వంటి దాని మార్గదర్శక తొలి ఆవిష్కరణలతో కీలకంగా ఉందన్నారు. ఏఐ, రోబోటిక్స్ మరియు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను వ్యాధికి చికిత్స చేయడానికి మాత్రమే కాకుండా, దానిని అంచనా వేయడానికి, నివారించడానికి, ఏకీకృతం చేస్తున్నామని జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి తెలిపారు.

రెండు రోజుల్లో 4,096 మంది మహిళలకు పరీక్షలు



డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో రెండు రోజుల్లో స్వాస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కింద 4,096 మంది మహిళలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 14 పీహెచ్‌సీలతో పాటు 122 సబ్‌సెంటర్, బస్తీ దవాఖానాల్లో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇందులో ఇప్పటివరకు 1853 మంది బీపీ, 1419 మంది షుగర్, 686 మంది క్యాన్సర్ స్క్రీనింగ్, 585 మందికి మానసిక ఆరోగ్య కోసం కౌన్సెలింగ్, 495 మంది గర్భిణీ మహిళలకు ఏఎన్‌సీ పరీక్షలు, 120 మంది బాలికలు, గర్భిణీల వ్యాక్సినేషన్, 995 మందికి అనీమియా స్క్రీనింగ్, 750 మంది మహిళల ఆరోగ్య సంరక్షణకు కౌన్సెలింగ్, 1180 మంది న్యూట్రిషన్‌పై కౌన్సెలింగ్, 45 మంది సికిల్ సెల్ స్క్రీనింగ్, 526 మందికి టీబీ పరీక్షలు నిర్వహించినట్లు ఆమె వివరించారు.

సింగూరు నుంచి దిగువకు 50 వేల క్యూసెక్కులు

పుల్‌కల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సింగూరు ప్రాజెక్టు నుంచి ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా 50,751 క్యూసెక్కుల(ఔట్‌ఫ్లో) వరద నీరు దిగువకు ప్రవహిస్తున్నది. ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతూనే ఉన్నది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 49,176 నమోదైంది. గురువారం రాత్రి అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో 520.655 మీటర్లకు 17.067 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. దిగువన మంజీర రిజర్వాయర్‌కు వదర ప్రవాహం పోటెత్తింది. రిజర్వాయర్ నాలుగు క్రస్ట్ గేట్లను ఐదు మీటర్ల ఎత్తు, ఒక స్కువర్ గేట్ మీటరున్నర ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లుగానే వనదుర్గా ప్రాజెక్టు (ఘనపురం ఆనకట్టకు) వదులుతున్నారు.

అమెరికా సుంకాలపై భారత్ ప్రతీకారం ఉండబోదు

- ఐఐఎం ఇండోర్ అధ్యాపకుడు డాక్టర్ అజీమ్‌ఖాన్

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అమెరికా విధించిన సుంకాలపై భారత్ ప్రత్యక్ష ప్రతీకార చర్యలకు దిగబోదని ఐఐఎం ఇండోర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మొహమ్మద్ అజీమ్‌ఖాన్ అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ గురువారం నిర్వహించిన ఆన్‌లైన్ ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ఈ విషయం స్పష్టం చేశారు. భారతదేశం చర్చల ద్వారా సుంకాలను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తూనే, ఇతర దేశాలకు ఎగుమతి అవకాశాలను పెంచుకునే మార్గాన్ని అనుసరిస్తుందని తెలిపారు. అమెరికా విధించిన 50 శాతం సుంకాల వల్ల భారత వస్త్ర పరిశ్రమ తీవ్రంగా ప్రభావితం అయ్యిందని, దీనివల్ల భారతదేశ జీడీపీ0.3 నుంచి 0.5 శాతం వరకు తగ్గే ప్రమాదం ఉందని అంచనా వేశారు. అయినప్పటికీ, ఇది కొత్త మార్కెట్లను అన్వేషించడానికి దేశానికి ఒక అవకాశంగా ఆయన పేర్కొన్నారు. 2030 నాటికి ప్రపంచంలోని మూడు అగ్ర వాణిజ్య శక్తులలో ఒకటిగా దేశం ఎదగాలనే ఆయన నొక్కి చెప్పారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లో నిర్వహించిన అఖిల భారత థల్ సైనిక్ క్యాంప్ (ఏటీఎస్‌సీ)లో పాల్గొన్న గీతం ఎన్‌సీసీ క్యాడెట్ దాసరి ధనిక్ బాబాను యూనివర్సిటీ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, ఎన్‌సీసీ అధికారి అజయ్ ఆయనను అభినందించారు.

సిగాచీ బాధిత కుటుంబాలకు న్యాయం చేయండి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అతిమేల మానిక్

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సిగాచీ పరిశ్రమ బాధిత కుటుంబాలకు 30 రోజుల్లో పరిహారం అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించి 80 రోజులైనా పూర్తి పరిహారం అందలేదని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అతిమేల మానిక్ అన్నారు. గురువారం పాశమైలారంలో సిగాచీ పరిశ్రమ బాధిత కార్మిక కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. బాధిత కుటుంబ సభ్యులు వారి బాధలు కష్టాలు చెప్పుకుంటూ కన్నీళ్ల పర్యంతం అయ్యారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినా జిల్లా అధికారులు, కార్మిక శాఖ ఎందుకు హామీ పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. కార్మికుల అంటే లెక్క లేదన్నారు. రూ.కోటి పరిహారం ప్రకటించి కేవలం 25 లక్షలు మాత్రమే ఇచ్చారన్నారు. పూర్తిస్థాయి పరిహారం వెంటనే బాధిత కుటుంబాలకు ఇవ్వాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు రాజు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో 5.8 కిలోల మత్తుమందు స్వాధీనం

- ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు అరెస్ట్

మాసాయిపేట, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మాసాయిపేటలో పోలీసులు 5.8 కిలోల మత్తు మందును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అరెస్ట్ చేశారు. చేగుంట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. మాసాయిపేటలోని పంజాబీ డాబా వద్ద మత్తు మందు తరలిస్తున్నారని పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో దాడులు చేసి ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాహెల్ పాండే, మనోజ్ పాండే అనే అన్నదమ్ములను అదుపులోకి తీసుకున్నారు. లారీ డ్రైవర్లు అయిన వీరు అక్కడి నుంచి మత్తు మందు తీసుకువచ్చి జాతీయ రహదారి వెంట ఉన్న దాబాల్లో సరఫరా చేస్తుంటారు. వారి నుంచి 5.8 కిలోల మత్తు మందును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- యువతను, విద్యార్థులను ప్రోత్సహించే దిశగా పోటీలు
- జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్



కబడ్డీ ఆడుతున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్

జహీరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : క్రీడారంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. 69వ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో భాగంగా జహీరాబాద్ రంజోల్‌లో అండర్-14, 17 జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. జిల్లాలోని 28 మండలాలలు, 1200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి, జ్యోతిని వెలిగించి క్రీడలను అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ యువతను, విద్యార్థులను ప్రోత్సహించేలా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాస్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. బడుల్లో ఖాళీగా ఉన్న పీఈటీ టీచర్ల నియమాకానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి శుక్లవర్ధన్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్, ఆల్‌ఇండియా బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం బాబానగర్‌కు వెళ్లే అండర్‌బ్రిడ్జీని పరిశీలించి, సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఇటీవల మృతిచెందిన రెండో వార్డు కౌన్సిలర్ తాహేరాబేగం ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆన్‌లైన్ సేవలు, అభివృద్ధిపై కితాబు

హుగ్గెల్లి, ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో ఉత్తరప్రదేశ్ బృందం పర్యటన

జహీరాబాద్/ సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రజా ప్రతినిధులు, పంచాయతీరాజ్ అధికారులతో కూడిన బృందం సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి మండలాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా హుగ్గెల్లి, ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామాలను సందర్శించి, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, గ్రామీణాభివృద్ధి విధానాలను పరిశీలించారు. జహీరాబాద్ పరిధిలోని హుగ్గెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు వేదిక కార్యక్రమంలో అపార్డ్ సీఈవో రాఘవేందర్‌రావు మాట్లాడుతూ ఆన్‌లైన్ సేవల వల్ల ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. గ్రామాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, పరిపాలనా విధానంపై ఉత్తరప్రదేశ్ బృందానికి అవగాహన కల్పించారు. వ్యవసాయ భూములు, పంటలు, మార్కెటింగ్ విధానం వంటి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచిన తీరును వివరించారు. ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలో పర్యటించిన బృందం సభ్యులు, అక్కడి అభివృద్ధిపై ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ రహిత పర్యావరణం, పాఠశాలల్లోని కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, పల్లె దవాఖానలో అందుతున్న వైద్య సేవలను అభినందించారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లు, అలాగే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల అమలు తీరు చాలా బాగుందని బృందం సభ్యులు కితాబునిచ్చారు. ఈ పర్యటనతో ఎంతో సంతృప్తి చెందామని వారు పేర్కొన్నారు.



హుగ్గెల్లి రైతు వేదికవద్ద ఉత్తర్‌ప్రదేశ్ బృందం

కంది మండలంలో ఉపాధిహామీ కేంద్ర బృందం పర్యటన

కంది, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కంది మండలం చేర్యాల గ్రామాన్ని మహారాష్ట్ర, సోలాపూర్ జిల్లాలకు చెందిన ఉపాధిహామీ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని పనులు విజిట్ చేశారు. సీసీ రోడ్డు, శ్మశానవాటిక, స్కూల్ కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, బాలబాలికల మూత్ర శాలల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం బృహత్‌పల్లె ప్రకృతి వనంను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అసిస్టెంట్ పీడీ పూజ, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కొత్తపల్లి సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

యూరియా కోసం రైతుల ధర్నా

శివ్వంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు గురువారం శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద క్యూలో గంటల తరబడి వేచిఉన్నారు. ఎంతసేపటికీ యూరియా పంపిణీ చేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు నర్సాపూర్ - తూప్రాన్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



నర్సాపూర్ - తూప్రాన్ రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న రైతులు

యువకుడి సాహసాన్ని అభినందించిన ఎస్పీ



దేవిసింగ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రాజ్‌పేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బ్రిడ్జిపై చిక్కుకున్న 10 మందిని తండాకు చెందిన దేవిసింగ్ రక్షించాడు. ఆ యువకుడి ధైర్యసాహసాన్ని గుర్తించిన జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో దేవిసింగ్‌ను, ఆయన తండ్రి దనుజానితోపాటు మాజీ సర్పంచ్ కిషన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఒకరినొకరు సహాయపడాలన్నారు. పోలీసు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఫైర్ శాఖలు భారీ వర్షాలకు వరదల్లో చిక్కుపోయిన 350 మంది ప్రజల్ని కాపాడారని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

'ఏఐఐఈఏ పోరాట ఫలితంగానే బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు'

చేగుంట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏఐఐఈఏ పోరాట ఫలితంగానే బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు అయిందని, దీనిని కోసం 400 మంది ఎంపీలను కలిశామని ఐసీఈయూ సికింద్రాబాద్ డివిజన్ జనరల్ సెక్రెటరీ డీఎస్ రఘు పేర్కొన్నారు. అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం మెదక్ హెడ్ క్వార్టర్స్ ఎల్ఐసీ కార్యాలయంలో జరగనున్న సర్వసభ్య సమావేశానికి వెళ్తున్న క్రమంలో చేగుంటలో గురువారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ అలాగే ఎఫ్‌డీఐ వంద శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తుందని, దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సంవత్సరానికి రూ.7,324 కోట్ల డివిడెంట్ కింద కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చామని, ప్రభుత్వ ఇన్సూరెన్స్ రంగాన్ని షేర్ మార్కెట్లోకి తీసుకెళ్లడం సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. బీమా రంగం ప్రైవేట్‌పరం కాకూడదని, ప్రభుత్వం వద్దనే ఉంటే ప్రజలకు రక్షణగా ఉంటుందన్నారు. అలాగే ఎల్ఐసీలో మూడో, నాల్గో తరగతి ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఈయూ అధ్యక్షుడు గుణశేఖర్, జనరల్ సెక్రెటరీ డీఎస్ రఘు, అసిస్టెంట్ ట్రెజరర్ ఎండీ జావేద్, ఐసీఈయూ నాయకులు బచ్చు రాములు, కత్తి భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



మెదక్‌లో గ్యాస్ డెలివర్రీ

- బుక్ చేసి వారం రోజులైనా సరఫరా లేదు
- ఏజెన్సీ ఎదుట బారులు తీరిన వినియోగదారులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మెదక్‌లో వంటగ్యాస్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. సిలిండర్‌ను బుక్ చేశాక వారం రోజులు దాటినా ఇంటికి డెలివరీ కావడం లేదు. దీంతో గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో గ్యాస్ ఏజెన్సీ వద్ద ఖాళీ సిలిండర్లను క్యూలో పెట్టి వినియోగదారులు బారులు తీరారు. రానున్న బతుకమ్మ, దసరా పండుగ ముందు గ్యాస్ కొరత ఏర్పడడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. రవాణా లారీల సమ్మె కారణంగా సిలిండర్ల కొరత ఏర్పడిందని, కర్నూల్ నుంచి లోడ్ వస్తుందని, ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు.

చెరువు అలుగు కాలువల ఆక్రమణల తొలగింపు

తూప్రాన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధిలోని భూంచెరువు అలుగు కాలువల ఆక్రమణలను గురువారం అధికారులు తొలగించారు. ఈ కాలువలు కొన్నేళ్లుగా నిండకపోవడంతో కొందరు వాటిని ఆక్రమించి ఇళ్లు, వ్యాపారాలు నిర్మించుకున్నారు. దీంతో వర్షపు నీరు వ్యవసాయ భూములను ముంచి, పంటలకు నష్టం కలిగిస్తోంది. దీంతో రైతులు, గ్రామస్థులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. తూప్రాన్ - నర్సాపూర్ రోడ్డు పక్కనే ఉన్న కాలువల్లోని ఆక్రమణలను తొలగించడానికి ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్, ఏఈ అనురాధ ఘటనా స్థలానికి చేరుకోగా, స్థానికులు అడ్డుకున్నారు. వెంటనే ఎస్ఐ శివానందం వచ్చి పరిస్థితిని చక్కదిద్ది, కాలువలను యథావిధిగా పునరుద్ధరించాలని ఆదేశించారు. దీంతో అధికారులు గురువారం ఎక్స్‌కవేటర్ సహాయంతో కాలువలను బాగుచేసే పనులు చేపట్టారు. రైతులు, గ్రామస్థుల సహకారంతో చెరువు నీరు ప్రవహించేందుకు మార్గం సుగమమైంది.

మద్యం మత్తులో సెల్లార్ గుంతలో పడి వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో సెల్లార్ గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని నమిలెట్ గ్రామానికి చెందిన బొక్క రామయ్య(45) భార్య వీరమ్మ ముగ్గురు పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. దూలపల్లిలోని మహాలక్ష్మి వెంచర్‌లో ఓ గదిలో ఉంటూ కూలీ పనిచేసుకుంటున్నాడు. గురువారం ఉదయం మద్యం తాగి ఇంటికి వస్తుండగా, అతడి ఇంటి గది పక్కనే ఉన్న పాత సెల్లార్ గుంతలో పడిపోయాడు, గుంతలోపడిన శబ్దం విన్న భార్య వీరమ్మ గదిలో నుంచి బయటకు వచ్చి చూడగా గుంతలో రామయ్య కనిపించాడు. పక్క నుంచి బయటకు రమ్మని భార్య చెప్పినా వినకుండా మరో పక్క నుంచి బయటకు వస్తానని సెల్లార్ మధ్యలోకి వెళ్లి నీట మునిగాడు. కుమారుడు కిరణ్, భార్య కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యాయత్నం

- భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం

కొల్చారం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లకు చేసిన అప్పులు తీరక దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. భర్త మరణించగా, భార్య పరిస్థితి విషమంగా ఉంది. మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన నిరుడు నర్సింహులు(44), యశోద దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు సంతానం. కాగా వారికి మూడేళ్ల క్రితం అప్పు చేసి వివాహాలు చేశారు. నర్సింహులు తనకున్న ఎకరంన్నర అసైన్డ్ భూమిలో ఏటా సాగు చేసినా అప్పులు తీరలేదు. దీంతో అప్పులు తీరే మార్గం కనిపించక భార్యాభర్తలు ఇద్దరూ ఈ నెల 14న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. ఆ బాధ భరించలేక కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి వారిని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. నర్సింహులు బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందగా, యశోద ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. నర్సింహులు తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు కార్లను ఢీ కొన్న ట్రావెల్ బస్సు

- బస్సులో ప్రయాణికుడు గుండెపోటుతో మృతి

మాసాయిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మాసాయిపేటలో బుధవారం రాత్రి ఓ ట్రావెల్ స్లీపర్ బస్సు విధ్వంసం సృష్టించింది. 44వ జాతీయ రహదారిపై సాయిబాబా గుడి సమీపంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న బస్సు వేగంగా వచ్చి రెండు కార్లను ఢీ కొన్నది. ఈ సమయంలో బస్సులో నిద్రిస్తున్న ప్రయాణికుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్‌కుమార్ పాల్(35)కు గుండెపోటు వచ్చింది. తోటి ప్రయాణికులు సీపీఆర్ చేసినా అతని ప్రాణాలు దక్కలేదు. ఈ మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

- మహిళ మృతి..మరొకరి పరిస్థితి విషమం

గుమ్మడిదల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టిన సంఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉండగా, ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదలలో సంతను ముగించుకొని ఆటోలో మొత్తం తొమ్మిది మంది నల్లవల్లి గ్రామానికి బయలుదేరారు. మెదక్-హైదరాబాద్ హైవే రోడ్డులో మంబాపూర్ శివారులో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని అదుపుతప్పి ఆటో ఢీకొన్నది. ఆటోని నల్లవల్లి గ్రామానికి చెందిన మహిళ ఇందిరా(45) అక్కడికక్కడే మృతి చెందగా, అందూర్ గ్రామానికి చెందిన యాదగిరికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. మిగతా ఏడుగురికి స్వల్ప గాయాలు కావడంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి'



మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం, ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సౌకర్యాలు అందించాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేటలో ఆశా వర్కర్ల నాలుగవ జిల్లా మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. నిధులను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయాలని కుట్ర పన్నుతోందని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామన్నారు. మహాసభలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలస్వామి, కోశాధికారి భాస్కర్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ, నాయకులు భూలక్ష్మి, భాగ్యలక్ష్మి, శ్యామల, భారతమ్మ, నీరజ, యాదలక్ష్మి, రజిత, సంతోష, శ్రీలత, బాలమణి, రేణుక, పుష్పలత, భాగ్యలక్ష్మి, వాణి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి : బీజేపీ



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి

అక్కన్నపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు ముందు మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అక్కన్నపేట మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. అక్కన్నపేట మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలపాలని, గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందజేయాలని కోరారు. అక్కన్నపేట మండల కేంద్రంలో మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మించాలని, గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హామీ మేరకు పథకాలన్నీ అమలు చేయాలని, లేని యెడల బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మడక రవికుమార్ ఉన్నారు.

'అనాథ చిన్నారులకు అండగా ఉంటాం'



చిన్నారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో పెద్దదిక్కు కోల్పోయి అనాథలైన చిన్నారులకు అండగా ఉంటామని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. వర్గల్ మండలం గౌరారంలో ఇటీవల ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో 13 ఏళ్లలోపు చిన్నారులు నైనిక, అక్షయ్‌లు అనాథలుగా మారారు. గురువారం వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆ చిన్నారులను పరామర్శించి రూ.30వేల ఆర్థిక సాయం చేశారు. వారికి మనోధైర్యాన్ని కల్పిస్తూ భవిష్యత్తులో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా యువజన అధ్యక్షుడు దేవగణిక నాగరాజు, సీనియర్ నాయకులు మైపాల్‌రెడ్డి, కనకరాజు, మధుసూదన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, హుస్సేన్, సద్దాం, భాస్కర్, చైతన్య, నరేందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు, అధ్యాపకులు

గజ్వేల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు హోరెత్తాయి. విద్యార్థులు, అధ్యాపకుల ఆధ్వర్యంలో బతుకమ్మను పేర్చి ఘనంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. అనంతరం గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువులో నిమజ్జనం చేశారు.

వంద డ్యూయల్ డెస్కుల అందజేత



డబుల్ డెస్క్‌లపై కూర్చున్న విద్యార్థులు

గజ్వేల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు హైదరాబాద్ మోదీ బిల్డర్స్ ఆధ్వర్యంలో వంద డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కళాశాలలో ఈ ఏడాది అడ్మిషన్లు పెరగడంతో విద్యార్థులు కింద కూర్చోవాల్సి వస్తుందని ప్రిన్సిపాల్, మోదీ బిల్డర్స్ జీఎం రజని దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించిన జీఎం బెంచీలను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు.



మర్పడగ శివారులో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ప్రమాదకరంగా..

- గుంతలమయంగా మారిన రోడ్లు.. తరచూ ప్రమాదాలు
- అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వేడుకోలు

కొండపాక, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగ, సిరసనగండ్ల గ్రామాల రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. మర్పడగ రైస్ మిల్ వద్ద తొగుటరోడ్డు వైపు పెద్ద గుంత ఏర్పడింది. మర్పడగ నుంచి దుద్దెడ.. కొండపాక వైపు నుంచి రాజీవ్ రహదారి పైకి వాహనాలు నిత్యం పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తుంటాయి. సిద్దిపేట-హైదరాబాద్‌కు రూట్‌లో టోల్ రుసుము తప్పించుకునేందుకు దుద్దెడ శివారులోని టోల్‌గేట్ రాకముందే తొగుట-మర్పడగ రోడ్డు నుంచి సిద్దిపేట వైపు వాహనదారులు వెళ్తుంటారు. ఈ భారీ వాహనాల రాకపోకల వల్ల దుద్దెడ నుంచి మర్పడగ వరకు రోడ్డుపై అక్కడక్కడ భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలు పడటంతో గుంత మరింత పెద్దగా మారి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక వాహనదారులు వాటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా రోడ్డుపై గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద పబ్లిక్ టాయిలెట్లను శుభ్రం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

చీపురు పట్టి, టాయిలెట్‌ను శుభ్రం చేసి...

సిద్దిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత మన బాధ్యత, పరిశుభ్రత ఒక అలవాటుగా మారాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద స్వచ్ఛతా హీ సేవా-2025లో భాగంగా పబ్లిక్ టాయిలెట్లను మున్సిపల్ సిబ్బందితో కలిసి చీపురు పట్టి సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశుభ్రత కోసం సరైన నిర్వహణ, ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, వ్యక్తిగత పరిశుభ్రత సైతం పాటించడం అవసరమన్నారు. అనంతరం ఆయా పాఠశాలల విద్యార్థులతో స్వచ్ఛతోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. బతుకమ్మ పండుగ ఏర్పాట్లలో భాగంగా సిద్దిపేట పట్టణంలోని ఎర్ర చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలించారు. పారిశుధ్య కార్మికుల కోసం పట్టణంలోని విపంచి కళా నిలయంలో హెల్త్ క్యాంపును నిర్వహించారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



రోడ్డును శుభ్రం చేస్తున్న నాయకులు

సిద్దిపేట క్రైం/చేర్యాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా పక్షం' కార్యక్రమంలో భాగంగా గురువారం సిద్దిపేటలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్, పార్టీ నాయకులతో కలిసి పాత బస్టాండ్‌తో పాటు రోడ్లను చీపురు పట్టి శుభ్రం చేశారు. నాయకులు సంతోష్, పవన్, వెంకట్రావు యాదన్‌రావు, కార్తీక్, వేణు, యాదగిరి, కర్ణాకర్, మహేందర్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

- చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలోని శివాలయం ఆవరణలో పారిశుధ్య పనులు నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు పారిశుధ్య కార్మికులను శాలువా కప్పి సత్కరించారు. నాయకులు సురేశ్, సిద్ధారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలనర్సయ్య, యాదగిరి, వినయ్‌కుమార్, బాల్‌రెడ్డి, మల్లరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

గజ్వేల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధికి, కార్మిక సమస్యల పరిష్కారానికి నాయకులు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్‌కు చెందిన సీపీఎం నాయకుడు కర్ణకంటి వెంకటాచారి సిద్దిపేట కార్యాలయంలో ఆయన సమక్షంలో సీపీఐలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన వెంట సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ తదితరులున్నారు.

'కార్మికుల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం'

గజ్వేల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్మికుల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ చెట్లపల్లి బాలకృష్ణ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల ఆరోగ్యానికి భద్రతను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఆర్ఐలు రమేశ్ భట్, శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్



వైద్య శిబిరాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్

అక్కన్నపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ అన్నారు. గురువారం అక్కన్నపేట మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఇక్కడ నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరంలో అందిస్తున్న సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు.

బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

హుస్నాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై గురువారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద పెద్ద బతుకమ్మ వేడుకలు జరగనుండగా, అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఆ తర్వాత ఎల్లమ్మ చెరువు కట్టపై జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, ఏసీపీ సదానందం, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

పర్యావరణంలో సూక్ష్మజీవుల పాత్ర కీలకం

గజ్వేల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణంలో సూక్ష్మజీవుల పాత్ర కీలకమని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ అన్నారు. కళాశాలలో మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ సూక్ష్మజీవుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. మైక్రోబయాలజీ అధ్యాపకురాలు తుమ్మ లావణ్య ఆధ్వర్యంలో విద్యార్థులు రంగోలి, నమూనాలు తయారు చేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, మైక్రోబయాలజీ విభాగం హెచ్ఓడీ విజయభాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు భవాని, రాంచంద్రం, అమలాదేవి, కవిత, జ్యోతి, పద్మ, మమత, శిరీష, వనజ తదితరులున్నారు.

ఆయిల్ పామ్ తోటలతో అధిక లాభాలు

- పలు మండలాల్లో మొక్కలు నాటిన అధికారులు



సిద్దిపేట రూరల్ : ఆయిల్ పామ్ మొక్కలు నాటుతున్న అధికారులు

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ తోటల పెంపకంతో అధిక లాభాలు గడించవచ్చునని ఆయిల్ పామ్ జిల్లా అధికారి పురుమండ్ల భాస్కర్‌రెడ్డి రైతులకు సూచించారు. గురువారం నారాయణరావుపేట మండలం గోపులాపూర్ గ్రామంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం, హార్టికల్చర్, వ్యవసాయ శాఖల నుంచి సబ్సిడీపై పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు ఏఓలను, ఏఈఓలను, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయ అధికారి పరశురాంరెడ్డి, ఏపీవో శివ, పంచాయతీ కార్యదర్శి మహేష్, టీఏ రేణుక, మాజీ ఎంపీపీ బాలకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

- ములుగు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం అలీనగర్ గ్రామంలో పైళ్ల కృపాల్‌రెడ్డి, పోల్‌రెడ్డి భూమిలో గురువారం 570 ఆయిల్ పామ్ మొక్కలు నాటినట్లు ములుగు వ్యవసాయ అధికారి ప్రగతి తెలిపారు. వాటిని పరిశీలించిన ఆమె ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ సౌమ్య, రైతులు పాల్గొన్నారు.
- మద్దూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సలాక్‌పూర్ గ్రామంలో కొండల్‌రెడ్డి అనే రైతు వ్యవసాయ భూమిలో 9 ఎకరాలలో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మద్దూరు ఏవో రామకృష్ణ , ఏఈఓలు రాజు, కల్పన, అనూష, ఫీల్డ్ ఆఫీసర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.
- మిరుదొడ్డి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో 9.5 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలను నాటినట్లు మండల వ్యవసాయాధికారి మల్లేశం తెలిపారు. ఈ సందర్భంగా రైతులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు అఖిల్, రేఖ, ఫీల్డ్ ఆఫీసర్ ఆంజనేయులు, రైతులు తిరుపతిరెడ్డి, భూంరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

దంచికొట్టిన వాన

(5వ పేజీ తరువాయి)

నిలిచింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నంగునూరు మండలంలోని రాజగోపాలపేటలోని పెద్దచెరువు మూడేళ్ల తర్వాత కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతంలో నుంచి వచ్చిన నీటితో అలుగు పారుతోంది. పరిసర ప్రాంతాల్లోని పాలమాకుల, ఓబులాపూర్, జేపీ తండా, బద్దిపడగ తదితర ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరగనున్నాయి. రాజగోపాల్ పేట పెద్దచెరువు పరవళ్లు తొక్కుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



తొగుటలో ఇళ్లలోకి చేరిన వరద నీటిని ఎత్తిపోస్తున్న ఇంటి యజమాని



చిన్నకోడూర్ మండలం ఇబ్రహీంనగర్ శివారులో రాజన్న వాగు రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు



రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కొడకండ్ల విద్యార్థులు

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కొడకండ్ల విద్యార్థులు ఎంపికయ్యారు. సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో మెదక్ జిల్లా స్థాయి 69వ ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలు జరుగుతున్నాయి. ఇందులో గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సాత్విక్, అక్షయ, హర్షవర్ధన్, అవంతిక, రమ్యలు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికయ్యారు. వారిని పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు..

దుబ్బాక, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు దుబ్బాక మున్సిపాలిటీలోని లచ్చపేట విద్యార్థులు నాజియా, ఐశ్వర్య, సృజన, క్రాంతికుమార్ ఎంపికయ్యారని గురువారం దుబ్బాక ఎంఈవో ప్రభుదాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే కళా ఉత్సవ్ పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు..

దుబ్బాక, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం హబ్షీపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు కిరణ్, భవదీష్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని గురువారం ఆ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి 35వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో వారు పాల్గొననున్నట్లు తెలిపారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాంరెడ్డి పేర్కొన్నారు. జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలో బాలిక డెంగ్యూ లక్షణాలతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అలాగే తిమ్మాపూర్‌లో ఇద్దరు డెంగ్యూతో చికిత్స పొందుతున్నారు. గురువారం ఆ గ్రామాల్లో ఎంపీడీవో పర్యటించి, విష జ్వరాలపై, డెంగ్యూ వ్యాధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజామొహినుద్దీన్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పండుగకైనా వేతనాలివ్వాలి

కొండపాక, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు పండుగకైనా అందించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్‌నర్సయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడు నెలల వరకు వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో కార్మికులు తమ కుటుంబాలను అప్పులు చేసి పోషించుకుంటున్నారన్నారు. కనీసం బతుకమ్మ, దసరా పండుగకైనా జీతాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయాస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు జాలిగామ ప్రభాకర్, నాయకులు కొమురయ్య, నర్సింహులు, నారాయణ, రాజు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

ములుగు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగం పెంచాలని ఎంపీడీవో స్వర్ణకుమారి అన్నారు. గురువారం ములుగు మండలం బండమైలారం, కొత్తూరు, సింగన్నగూడ, కొక్కొండ, నర్సాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఇండ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసుకోవాలని కోరారు. ఎవరికైనా బిల్లుల విషయంలో ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తేవాలన్నారు. ఆమె వెంట ఎంపీఓ వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, సతీష్‌రెడ్డితో పాటు లబ్ధిదారులు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి.. ఏడుగురు అదుపులోకి..

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడి చేసిన ఏడుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారులో పాతూరి విజేందర్ వ్యవసాయ పొలం వద్ద షెడ్‌లో పేకాట ఆడుతున్నారని సమాచారం అందగా దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఎల్లారెడ్డి, అశోక్, శ్రీకాంత్, వెంకట్, అంజాగౌడ్, కార్తీక్‌రెడ్డి, రాజులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.20,153, 7 మొబైల్ ఫోన్లు, 4 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అలాగే వారికి ఆశ్రయం కల్పించిన షెడ్ యజమానిపై కేసు నమోదు చేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు తెలిస్తే టాస్క్‌ఫోర్స్ అధికారుల నంబర్లు 8712667445, 8712667446, 8712667447లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

తరగని ఆస్తి విద్యార్థులే..

చిన్నకోడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు తమ ఉద్యోగ జీవితంలో తరగని ఆస్తి వారి వద్ద చదువుకున్న విద్యార్థులేనని జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం చిన్నకోడూరు మండలం రామంచ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్లా షరీఫ్ ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ రోజాశర్మ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, ఎంఈవో యాదవరెడ్డి పాల్గొన్నారు.